

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీతూ
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

గురువారం 05 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 155 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది.. తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు





హైదరాబాద్, నవంబర్ 4 – సందేశం టైమ్స్: విధి నిర్వహణలో ఉండగా ప్రయాణికురాలి దాడికి గురై ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం అండగా నిలుస్తాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నివాళులర్పించారు. అనంతరం ప్రవళిక తల్లిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, ప్రభుత్వం తరఫున, ఆర్టీసీ తరఫున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని మంత్రి ప్రకటించారు. అంతేకాకుండా ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం మేరకు బ్యాంకు ద్వారా కోటి రూపాయల ప్రమాద బీమా కూడా కుటుంబానికి అందుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ కుటుంబ సభ్యురాలైన ప్రవళికను కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ యాజమాన్యం ఆసుపత్రికి చేరుకుని మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేసిందని, అయినప్పటికీ ఆమెను కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఆర్టీసీకి ప్రయాణికులకు మెరుగైన సాకర్యాలు కల్పించడం ఎంత ముఖ్యమో, కార్మికుల సంక్షేమం, భద్రత కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ ఘటనకు బాధ్యుడైన వ్యక్తిపై తొలుత హత్యాయత్నం కేసు ఉండగా, ప్రవళిక మృతి నేపథ్యంలో హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ సిబ్బంది ఎవరైనా ప్రయాణికుల పట్ల తప్పుగా ప్రవర్తించినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, తప్పు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. అయితే, సమస్య ఏదైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సిబ్బందిపై దాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఒకరి ఆవేశపూరిత చర్యతో నేడు ఒక కుటుంబం ఆధారాన్ని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారి పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు పలు నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఒక క్రమశిక్షణ కలిగిన సంస్థగా ప్రయాణికుల సాకర్యాల కోసం నిరంతరం పనిచేస్తుందని, ప్రయాణికులను దేవుళ్లుగా భావించి సేవలందించడం ప్రతి ఉద్యోగి బాధ్యతని తెలిపారు. ప్రయాణికులకు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే చట్టబద్ధంగా ఫిర్యాదు చేయాలని, పరస్పర సమస్యలను చట్టపరంగానే పరిష్కరించుకోవాలని కోరారు. ప్రవళిక కుటుంబానికి ఆర్థికంగా అన్ని విధాలా అండగా ఉంటామని, అయితే ఎంతటి ఆర్థిక సహాయం చేసినా కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధను తీర్చలేమని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు.



బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు.. ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు

కోదాడ, నవంబర్ 4 (సందేశం టైమ్స్): పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యం నిల్వలు, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోదాడ సమీపంలోని బాలాజినగర్‌లో ఉన్న ఎస్‌డబ్ల్యూసీ గోదాంను జిల్లా ఎస్పీ కె. నరసింహతో కలిసి కలెక్టర్ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాంలో నిల్వ ఉన్న బియ్యాన్ని, నిర్వహణ తీరును పరిశీలించడంతో పాటు స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు. బియ్యం నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించగా ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని నాణ్యత దెబ్బతినకుండా జాగ్రత్తగా నిల్వ చేయాలని, బియ్యం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని గోదాం మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. నిల్వ నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (FIFO) విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, స్టాక్ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు లేబర్ కార్డులు ఇప్పించాలని హమాలీలు కోరడంతో వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత కార్మిక శాఖ అధికారులతో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీల ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్ రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు ఉద్యోగాల అభ్యర్థులకు 11 పుస్తకాల స్టడీ మెటీరియల్ పంపిణీ

కోదాడ, నవంబర్ 4 (సందేశం టైమ్స్): పోలీసు ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువత శిక్షణను సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ సూచించారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన 200 మంది అభ్యర్థులకు కోదాడ పట్టణంలోని కేఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో ఉచిత ముందస్తు శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ అధికారుల సమక్షంలో 11 పుస్తకాలతో కూడిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ యువత జీవితంలో లక్ష్యం, గమ్యం స్పష్టంగా ఉండాలని, వాటిని చేరుకునేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చదవాల్సిన సబ్జెక్టులు, పరీక్షకు ఉన్న సమయాన్ని ముందుగానే అంచనా వేసుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలని తెలిపారు. గత ప్రశ్నాపత్రాలను పరిశీలించి పరీక్షల ప్రశ్నల సరళిని అర్థం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ కనీసం మూడుసార్లు పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, సూర్యాపేట, తుంగతుర్తి ఎమ్మెల్యేల సహకారంతో జిల్లా వ్యాప్తంగా 400 మంది పోలీసు ఉద్యోగాల ఆశావహులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, ఫిజికల్ ఈవెంట్స్‌లో అనుభవం ఉన్న పోలీసు సిబ్బందితో పాటు మెరుగైన వసతి సాకర్యాలు కల్పిస్తున్నామని, 11 పుస్తకాలతో కూడిన స్టడీ మెటీరియల్ అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ యువత విలాసాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదవాలని, నిరంతర సాధన, పట్టుదలతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్నారు. ఉచిత శిక్షణతో పాటు నాణ్యమైన భోజనం, వసతి సాకర్యాలు కల్పిస్తున్నామని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని పోలీసు ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో ఎక్కువ మంది యువతకు పోలీసు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ప్రయాణ ఇబ్బందులు కలగకుండా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన 200 మందికి కోదాడలోనే శిక్షణ ఏర్పాటు చేశామని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 400 మందికి ఉచిత శిక్షణ అందిస్తున్నామని వివరించారు. శిక్షణకు అభ్యర్థుల ఎంపికలో భాగంగా 1,400 మందికి పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా 400 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఇదే కార్యక్రమంలో జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బంది అభ్యర్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని వివరించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ అధికారులతో కలిసి సైబర్ సెక్యూరిటీ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సంతోష్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఇన్స్పెక్టర్లు రామారావు, శివకుమార్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఐలు సాయిరాం, సురేష్, అన్వర్, అధ్యాపకులు, శిక్షణ అందిస్తున్న పోలీసు సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి.. ఆకుపాముల జెడ్పీహెచ్ఎస్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



సూర్యాపేట, నవంబర్ 4 (సందేశం టైమ్స్): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు విద్యాబోధన ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. ఈ సందర్భంగా ఆకుపాముల గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలోని ఇంకుడు గుంతలు, టాయిలెట్లు, వంటగదిని పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణ, మధ్యాహ్న భోజనం తయారీ తీరును సమీక్షించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, విద్యా ప్రమాణాలు, పరీక్షల సన్నద్ధత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలల తనిఖీల కోసం ఏర్పాటు చేసిన ఫైనల్ ఇన్స్పెక్షన్ బృందంతో సమావేశమైన కలెక్టర్ విద్యాబోధన ప్రమాణాల మెరుగుదలకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, లెర్నింగ్ అవుట్‌కమ్స్ ఆధారంగా పాఠాలు బోధిస్తున్నారా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగం, లెసన్ ప్లాన్లు, ఇయర్ ప్లాన్లు, టీచింగ్ డైరీల నిర్వహణను తనిఖీ చేయాలని సూచించారు. వర్క్‌షీట్ల ద్వారా విద్యార్థులకు నిరంతర అభ్యాసం కల్పించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులతో నిత్యం మమేకమవుతూ వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని స్టాఫ్ రూమ్ పైకప్పు శిథిలావస్థకు చేరి స్లాబ్ దెబ్బతిన్న విషయాన్ని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై ఇప్పటికే ఎంపీడీఓకు దరఖాస్తు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విషయంలో అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో లోపాలు వెంటనే సరిదిద్దాలి.. అధికారులకు కలెక్టర్ ఆదేశం



హుజూర్‌నగర్, నవంబర్ 4 (సందేశం టైమ్స్): హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల మోడల్ కాలనీలో చిన్నచిన్న లోపాలు ఉన్నా వెంటనే సరిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం జిల్లా ఎస్పీ కె. నరసింహతో కలిసి మోడల్ కాలనీలోని గృహ నిర్మాణాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి హౌసింగ్ బ్లాక్‌ను సందర్శించి ఇళ్ల నిర్మాణ నాణ్యత, పనుల పురోగతిని పరిశీలించారు. ఇళ్లలో గుర్తించిన చిన్నచిన్న లోపాలను వెంటనే సరిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల మంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు గృహ సముదాయాల్లోని అన్ని బ్లాక్‌లను స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణంతో పాటు కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు వంటి మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా మిగిలిన పనులన్నింటినీ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జిల్లా స్థాయి కమిటీ సభ్యులుగా చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట, నవంబర్ 4 (సందేశం టైమ్స్): దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న అర్హులైన దివ్యాంగుల నుంచి జిల్లా స్థాయి కమిటీ సభ్యత్వానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వు నంబర్ 3, తేదీ 01-05-2018 ప్రకారం దివ్యాంగుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం ఐదుగురు సభ్యులతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కమిటీలో ఎస్సీ లేదా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఒకరు, ఒక మహిళా అభ్యర్థి, మరో ముగ్గురు సభ్యులు ఉండనున్నట్లు తెలిపారు. దివ్యాంగుల అభివృద్ధి కోసం వ్యక్తిగతంగా లేదా సంస్థల ద్వారా సేవలందిస్తున్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ ప్రకటన వెలువడిన ఆరు రోజుల్లోగా, నవంబర్ 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పూర్తి వివరాలతో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు దివ్యాంగుల సంక్షేమం కోసం గతంలో చేసిన సేవలకు సంబంధించిన వివరాలు, ఫొటోలు, పత్రికా కథనాల క్లిప్పింగ్స్ జతచేయాలని తెలిపారు. దరఖాస్తులను జి-1, జిల్లా కార్యాలయాల సముదాయం, కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కమిటీలో సభ్యులుగా ఎంపికైన వారికి సమావేశాల సందర్భంగా అధికారులతో కలిసి దివ్యాంగుల సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి తమ అభిప్రాయాలు తెలియజేసే అవకాశం ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి పేర్కొన్నారు.



జోగిపేటలో మైనార్టీ విద్యార్థుల చైతన్య ర్యాలీలు.. సామాజిక సమస్యలు, నీటి సంరక్షణపై అవగాహన

జోగిపేట, నవంబర్ 4 (సందేశం టైమ్స్): జోగిపేట పట్టణంలో మైనార్టీ కళాశాల విద్యార్థులు సామాజిక సమస్యలు, విద్యార్థుల హక్కులు, నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చైతన్య ర్యాలీలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ సమస్యలపై నినాదాలు చేశారు. విద్యార్థుల హక్కుల సాధన, సంక్షేమం, సామాజిక చైతన్యం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీల్లో కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం కూడా పాల్గొని విద్యార్థులకు మద్దతుగా నిలిచారు. ఇదే క్రమంలో నీటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ 'సేవ్ వాటర్' నినాదాలతో మరో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీటి వనరులను సంరక్షించాలని విద్యార్థులు ప్రజలకు పిలుపునిచ్చారు. భూగర్భ జలాలను కాపాడుకోవడం, నీటి వృథాను అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ పట్టణ ప్రజల్లో చైతన్యం కల్పించారు.



ఆర్టీసీ కార్మికులపై దాడులను అరికట్టాలి.. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి


సూర్యాపేట, నవంబర్ 4 (సందేశం టైమ్స్): ఆర్టీసీ కార్మికులపై ప్రయాణికులు చేస్తున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, విధి నిర్వహణలో మహిళా ఉద్యోగులకు పూర్తి భద్రత కల్పించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు బత్తుల సుధాకర్, సుంకరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మణుగూరు డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవళిక ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి, పది రోజుల పాటు చికిత్స పొందుతూ మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవళిక మృతికి నిరసనగా, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సూర్యాపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం మౌనం పాటించి ప్రవళికకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం రవాణా సేవలు అందిస్తున్న ఆర్టీసీ కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళా కండక్టర్లు విధి నిర్వహణలో వేధింపులు, దాడులు, అభద్రతా పరిస్థితులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికులపై దాడులు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తగిన రక్షణ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ప్రవళిక మృతి కేవలం ఒక కుటుంబానికి జరిగిన నష్టం మాత్రమే కాదని, ఆర్టీసీ కార్మికుల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగించే ఘటన అని అన్నారు. ప్రవళిక కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, ఐదు ఎకరాల భూమితో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి డిపోలో, ప్రతి బస్సులో కార్మికుల భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని, మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించాలని, పని భారాన్ని తగ్గించి తగిన విశ్రాంతి, మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సరిపడా బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా, వారి ప్రాణాలకు రక్షణ కల్పించకుండా విధులు నిర్వహించాలని ఆశించడం సరికాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి ప్రవళిక కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు కార్మికుల భద్రత, మహిళా ఉద్యోగుల రక్షణ, పని భారాన్ని తగ్గించడం వంటి అంశాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టి.డబ్ల్యూ.యు. డిపో కార్యదర్శి భాస్కర్, ఎస్.డబ్ల్యూ.ఎఫ్. కోశాధికారి ఏర్పుల వెంకన్న, యల్లయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, టి.డబ్ల్యూ.యు. నాయకులు, టి.ఎం.యు. డిపో కార్యదర్శి లచ్చయ్య, ఈ.యు. అధ్యక్షులు సేవ్యా, రమేష్, మల్లయ్య, రామచంద్రు, ఉపేందర్, ముస్తఫా, యూసుఫ్, నరేష్, మంజుల, సువర్ణ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.



ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.18 వేల గౌరవ వేతనం చెల్లించాలి.. రైతు సంఘం డిమాండ్

నడిగూడెం, నవంబర్ 4 (సందేశం టైమ్స్): ఉపాధి హామీ పథకంలో గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.18 వేల గౌరవ వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిలభారత కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలని చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా నడిగూడెం మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్లను కలిసి వారి సమస్యలను రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకుల బృందం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల అమలులో ఫీల్డ్ అసిస్టెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, గౌరవ వేతనం, ఉద్యోగ భద్రత లభించడం లేదని అన్నారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన జీవో 4779ను రద్దు చేసి ఫీల్డ్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని, వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించే పథకంలో బాధ్యతాయుతంగా పనిచేస్తున్న వారి సేవలను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, రైతు సంఘం సీనియర్ నాయకులు వీరాంజనేయులు, ఎస్.కె. లతీఫ్ బాబు, సుధాకర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షురాలు పద్మ, కొరట్ల వెంకటేశ్వర్లు, అంబేద్కర్, సీతారాం రెడ్డి, ఎస్.కె. మాసంబి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికురాలి దాడిలో గాయపడిన ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళిక మృతి.. కార్మిక సంఘాల ఆందోళన



మణుగూరు, నవంబర్ 4 (సందేశం టైమ్స్): విధి నిర్వహణలో ప్రయాణికురాలి దాడికి గురై తీవ్రంగా గాయపడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ డిపో మహిళా కండక్టర్ ప్రవళిక (24) హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. గత నెల 26వ తేదీన మణుగూరు వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో చిల్లర విషయంలో ప్రయాణికురాలితో జరిగిన ఘర్షణలో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. అశ్వాపురం మండలం మిట్టగూడెంకు చెందిన బాణోత్ మౌనిక తన కుమారుడితో కలిసి భద్రాచలం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కగా, కుమారుడి టికెట్ కోసం రూ.100 కండక్టర్ ప్రవళికకు ఇచ్చింది. రూ.10 టికెట్ జారీ చేసిన ప్రవళిక మిగిలిన చిల్లరను టికెట్ వెనుక రాసి ఇచ్చే ప్రయత్నం చేయగా, తనకు వెంటనే చిల్లర కావాలని ప్రయాణికురాలు వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రయాణికురాలు మౌనిక కండక్టర్ ప్రవళికను బస్సు నుంచి కిందకు తోసివేయడంతో ఆమె వెనుక టైర్ల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి కన్నుమూశారు. ప్రవళిక మృతి వార్తతో ఆర్టీసీ కార్మిక సంఘాల్లో తీవ్ర విషాదం, ఆగ్రహం వ్యక్తమయ్యాయి. ఆమె మృతికి నిరసనగా బుధవారం ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోల్లో బంద్ నిర్వహించాలని కార్మిక జేఏసీ పిలుపునిచ్చింది. ఈ ఘటనకు సంబంధించి అశ్వాపురం పోలీసులు ప్రయాణికురాలు బాణోత్ మౌనికను ఇప్పటికే అరెస్టు చేశారు. నిందితురాలిపై హత్య కేసు నమోదు చేయాలని, ప్రవళిక కుటుంబానికి రూ.కోటి ప్రమాద బీమా అందించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ మహిళా ఉద్యోగులపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు నిరంతరం సేవలందించే ఆర్టీసీ కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీటిపై ముందస్తు కార్యాచరణ చేపట్టాలి.. కలెక్టర్ ప్రతిమా సింగ్



హవేలీ ఘన్‌పూర్, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకునేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, నీటితో పాటు విద్యుత్‌ను కూడా ఆదా చేసే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు బుధవారం హవేలీ ఘన్‌పూర్ మండలం నర్దన గ్రామంలోని చెక్‌డ్యామ్‌ను మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం, తహసీల్దార్ సిందు రేణుక, గ్రామ సర్పంచ్ వినోద, విద్యుత్ శాఖ డీఈ రామేశ్వర స్వామి, మిషన్ భగీరథ ఈఈ సంపత్ కుమార్, ఇంట్రా డీఈ నరేష్ తదితర అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా కోసం మిషన్ భగీరథ అధికారులు రూపొందించిన మ్యాప్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. డిసెంబర్ తర్వాత సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉన్నందున, ఈ పరిస్థితిని ముందుగానే అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెదక్ జిల్లాకు రూ.42 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. నర్దన చెక్‌డ్యామ్ వద్ద ప్రత్యేక గ్రిడ్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి సుమారు 3.5 కిలోమీటర్ల మేర జక్కన్నపేట గ్రామం వరకు పైప్‌లైన్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవస్థ ద్వారా 33 గ్రామాలకు ప్రతిరోజూ ఒక్కొక్కరికి 55 లీటర్ల చొప్పున తాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. నర్దనతో పాటు పొడ్చాన్‌పల్లి, కొత్తపల్లి, మిన్‌పూర్ చెక్‌డ్యామ్‌ల వద్ద కూడా గ్రిడ్ వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని, గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లాలను గుర్తించి నీటి వృథాను అరికట్టాలని సూచించారు. గ్రామ సర్పంచులు గ్రామసభల్లో తీర్మానాలు చేసి సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లను నిర్ణీత సమయాల్లో మాత్రమే నడిపేలా చర్యలు తీసుకోవాలని, మిగిలిన సమయాల్లో వాటిని నిలిపివేయాలని తెలిపారు. దీనివల్ల భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు విద్యుత్‌ను ఆదా చేయవచ్చున్నారు. త్రీ ఫేజ్ మోటార్ల ద్వారా ఓవర్ హెడ్ రిజర్వాయర్ (ఓహెచ్ఆర్) ట్యాంకులను నీటితో నింపే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బోర్ల ఫ్లషింగ్, డీపెనింగ్, హైరింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, అందుబాటులో ఉన్న నీటి వనరులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, తాగునీరు, విద్యుత్ సరఫరా పరిస్థితులను నిరంతరం అంచనా వేస్తూ దీర్ఘకాలిక సమస్యలు ఉన్న ఆవాసాల్లో నీటి సరఫరా అంతరాయాలను ముందుగానే గుర్తించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రాబోయే రోజుల్లో ప్రజలకు నీటి భద్రత కల్పించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న ఈ చర్యలు ప్రస్తుత నీటి కొరతను అధిగమించడంతో పాటు భవిష్యత్తు తరాలకు నీటి వనరులను అందుబాటులో ఉంచేందుకు దోహదపడతాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మెదక్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

మెదక్, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం కల్పించే దిశగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎస్. రాజు ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ గ్రంథాలయంలో ప్రతిరోజూ చదువుకునే విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు చదువుకునే సమయంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఈ ప్లాంట్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా నీటి వృథాను అరికట్టేందుకు ప్లాంట్ నుంచి వెలువడే వ్యర్థ నీటిని చేతులు కడుక్కోవడానికి వినియోగించేలా, అనంతరం గ్రంథాలయ ప్రాంగణంలోని మొక్కలకు మళ్లించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల భద్రతే లక్ష్యం.. బాలల హక్కులపై పోలీసుల అవగాహన

జోగిపేట, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): విద్యార్థులకు బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, రహదారి భద్రత, సైబర్ నేరాలు, క్రమశిక్షణపై అవగాహన కల్పించేందుకు జోగిపేటలోని సెయింట్ డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోగిపేట ఎస్ఐ గిరి శ్రీకాంత్ తన పోలీసు బృందంతో హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల అడ్మినిస్ట్రేటర్ రెవ. ఫాదర్ ఎన్. సురేష్ పోలీసు బృందానికి స్వాగతం పలికారు. ఎస్ఐ గిరి శ్రీకాంత్ మాట్లాడుతూ బాలల హక్కులు, పోక్సో చట్టం, బాలలపై జరిగే లైంగిక నేరాల నుంచి రక్షణ, వ్యక్తిగత భద్రత, అనుచిత ప్రవర్తనను గుర్తించడం, ఆపద సమయంలో పోలీసుల సహాయం పొందే విధానాలను వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ఎదురయ్యే పరిణామాలను వివరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దల పట్ల గౌరవభావంతో మెలగాలని, క్రమశిక్షణ, సమయపాలన, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని హితవు పలికారు. అనంతరం పాఠశాల అడ్మినిస్ట్రేటర్ రెవ. ఫాదర్ ఎన్. సురేష్ మాట్లాడుతూ విద్య అనేది కేవలం పుస్తకాలు, పరీక్షలు, మార్కులకే పరిమితం కాకూడదని, విద్యార్థులను సామాజిక బాధ్యత కలిగిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం కూడా విద్యాసంస్థల బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రెవ. ఫాదర్ సిబి, అడ్మినిస్ట్రేటర్ రెవ. ఫాదర్ ఎన్. సురేష్, ప్రిన్సిపాల్ శ్రీమతి జిన్సీ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు విలువైన సూచనలు అందించిన ఎస్ఐ గిరి శ్రీకాంత్, పోలీసు బృందానికి పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పాఠశాల యాజమాన్యం స్పష్టం చేసింది.



రెడ్డిపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం.. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు: ఆంజనేయులు గౌడ్

నర్సాపూర్, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని తమ పంటకు గిట్టుబాటు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, వార్డు సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరువు రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టాలి

సంగారెడ్డి, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కరువు ప్రభావంతో పంట నష్టాలను ఎదుర్కొంటున్న రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు అర్హులైన రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్-2026 కరువు సహాయక చర్యల్లో భాగంగా ప్రత్యేక డీసీసీ/డీఎల్ఆర్ఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణ చెల్లింపు గడువు పొడిగింపు, తాత్కాలిక వాయిదా సదుపాయం కల్పించడం వంటి అంశాలపై సమీక్షించారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలు, సంబంధిత బ్యాంకుల పాలక మండళ్లు ఆమోదించిన విధానాలకు అనుగుణంగా అర్హులైన రైతులకు సహాయక చర్యలు సకాలంలో అందించాలని ఏఓ విజయలక్ష్మి సూచించారు. రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన రైతుల వివరాలను పక్కాగా సేకరించి, నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, రైతులకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2026 వరకు రెండు త్రైమాసికాల్లో జిల్లాలోని బ్యాంకులు 1,20,065 ఖాతాల ద్వారా మొత్తం రూ.2,520.18 కోట్ల పంట రుణాలను రైతులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని మొత్తం 28 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించగా, వాటిలో రెండు మండలాలు తీవ్ర కరువు ప్రభావిత మండలాలుగా, 26 మండలాలు మోస్తరు కరువు ప్రభావిత మండలాలుగా వర్గీకరించినట్లు వివరించారు. అయితే పంట రుణాల పునర్వ్యవస్థీకరణ అనేది రుణ చెల్లింపు నిబంధనల్లో మార్పులకు సంబంధించిన ప్రక్రియ మాత్రమేనని, దీనిని రుణమాఫీ పథకంగా భావించరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు డీఏ బి. శ్రీదేవి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌడిపల్లి ఎస్ఐగా నీరేష్ బాధ్యతల స్వీకరణ**



మెదక్, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా కౌడిపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా నీరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి మొక్కను అందజేశారు. కాగా, కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో గతంలో ఎస్ఐగా విధులు నిర్వహించిన అమర్ జిల్లా పోలీస్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించేలా అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని నూతన ఎస్ఐ నీరేష్‌కు ఎస్పీ సూచించారు.



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ప్రణయ్, మనసకు సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

అందోల్ నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి) అందోల్ మండల్ నేరడి గుంట గ్రామ విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై తీసుకొచ్చిన విద్యార్థులు ప్రణయ్, మనసలను గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడారంగంలో మరింత ముందుకు సాగుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో కూడా ప్రణయ్, మనసలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేస్తానని ప్రకటించారు. గ్రామంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, యువతను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్, వార్డు సభ్యులు బోయిని శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీష్ వర్ధన్‌కు ఆవుల రాజిరెడ్డి ఘన సన్మానం

నర్సాపూర్, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన హరీష్ వర్ధన్ ముదిరాజ్‌ను నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరీష్ వర్ధన్‌కు శాలువా కప్పి అభినందనలు తెలియజేయడంతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందుకు సంబంధించిన నియామక పత్రాన్ని అందజేశారు. విద్యార్థి రాజకీయాల్లో క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తూ వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పదవిని పొందడం అభినందనీయమని ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, యువత హక్కుల సాధనకు కృషి చేస్తూ ఎన్ఎస్‌యూఐ బలోపేతానికి మరింత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హరీష్ వర్ధన్ మాట్లాడుతూ తనకు ఈ స్థాయి గుర్తింపు రావడంలో ప్రోత్సాహం, సహకారం అందించిన ఆవుల రాజిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు, యువత సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారి హక్కుల సాధనకు కృషి చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

బాలసదన్‌లో బాలలకు న్యాయ అవగాహన కార్యక్రమం



సంగారెడ్డి, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని బాలసదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలలకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య హాజరై బాలలకు వివిధ చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బాలుడు, బాలికకు సమాన హక్కులు, గౌరవం, రక్షణతో పాటు నాణ్యమైన విద్య పొందే హక్కు ఉందని తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోందని వివరించారు. బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిషేధం, బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోక్సో), శారీరక, మానసిక వేధింపుల నివారణ, విద్యా హక్కు, బాలల సమగ్ర అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా బాలల అక్రమ రవాణా, దోపిడీ, ఇతర అసాంఘిక కార్యకలాపాల నుంచి రక్షణ పొందే విధానాలను వివరించారు. బాలలు ఎదుర్కొనే సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని తెలిపారు. ఎలాంటి వేధింపులు, అన్యాయం జరిగినా భయపడకుండా ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు లేదా బాలల సంరక్షణ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బాలసదన్‌లోని చిన్నారులకు న్యాయపరమైన సహాయం అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. సమాజంలో బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ప్రజలకు, ముఖ్యంగా బాలలకు చట్టాలపై అవగాహన కల్పించడం, న్యాయం అందరికీ చేరువ చేయడం, ఉచిత న్యాయ సేవలపై చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.



మిషన్ వాత్సల్యలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మెదక్, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ (ఎస్ఏఏ)లో మిషన్ వాత్సల్య పథకం కింద అవుట్‌సోర్సింగ్ విధానంలో వివిధ ఉద్యోగాల భర్తీకి అర్హులైన మహిళలు, పురుషుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఈ నియామకాల్లో భాగంగా మేనేజర్/కో-ఆర్డినేటర్, సోషల్ వర్కర్, పార్ట్‌టైమ్ డాక్టర్, నర్స్, ఆయా, చౌకీదార్/సెక్యూరిటీ గార్డు పోస్టులను భర్తీ చేయనున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మేనేజర్/కో-ఆర్డినేటర్ పోస్టుకు సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ), సోషియాలజీ, సైకాలజీ లేదా చైల్డ్ డెవలప్‌మెంట్‌లో పీజీ లేదా సంబంధిత డిగ్రీతో పాటు కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. సోషల్ వర్కర్ పోస్టుకు బీఎస్‌డబ్ల్యూ/ఎంఎస్‌డబ్ల్యూ లేదా సైకాలజీ, చైల్డ్ డెవలప్‌మెంట్‌లో డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. పార్ట్‌టైమ్ డాక్టర్ పోస్టుకు ఎంబీబీఎస్ అర్హత, నర్స్ పోస్టుకు ఇంటర్మీడియట్‌తో పాటు ఏఎన్ఎం, జీఎన్ఎం లేదా బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఉండాలి. ఆయా పోస్టుకు పదో తరగతి లేదా తత్సమాన అర్హతతో పాటు చిన్నారుల సంరక్షణలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తారు. చౌకీదార్/సెక్యూరిటీ గార్డు పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు సంబంధిత అనుభవం ఉండాలి. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయని కలెక్టర్ తెలిపారు. విద్యార్హతలు, పని అనుభవం, మెరిట్‌తో పాటు ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతలు, వయస్సు, నివాసం, పని అనుభవానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులను జతచేసి నవంబర్ 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామాల వారీగా తాగునీటి ప్రణాళికలు సిద్ధం చేయాలి



అందోల్ నవంబర్ 4 సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అందోల్ మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో తాగునీటి సరఫరాపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు అన్ని గ్రామపంచాయతీల సర్పంచ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పాల్గొని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏ గ్రామంలో ఏ నెల నుంచి నీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది, సమస్యను ఎదుర్కొనేందుకు ముందస్తుగా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలు ఏమిటి, గ్రామాల వారీగా ప్రణాళికను ఏయే అంశాలతో రూపొందించాలనే విషయాలను సర్పంచ్‌లకు వివరించారు. ప్రతి గ్రామంలో నీరు వృథా అవుతున్న ప్రాంతాలను గుర్తించి వెంటనే వృథాను అరికట్టాలని సూచించారు. ప్రతి ఇంటికి నీటి సరఫరా నిర్వహణలో భాగంగా ఆన్‌ఆఫ్ విధానాన్ని ఏర్పాటు చేసుకుని నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్లను ఏర్పాటు చేసి భూగర్భ జలాల పెంపునకు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినయ్ చౌహాన్, నూపరింటెండెంట్ యేనురత్నం, ఏపీఓ అర్చన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు



వట్‌పల్లి, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి) విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల (CWSN) కోసం వట్‌పల్లి మండల స్థాయి క్రీడా పోటీలను నవంబర్ 5వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి తెలిపారు. మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. వట్‌పల్లి మండల విద్యా వనరుల కేంద్రం సమీపంలోని సహిత విద్యా వనరుల కేంద్రంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీలు ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో ప్రజలకు తెలియజేస్తూ విజయవంతం చేయాలని మండల విద్యాధికారి కోరారు.





రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఎన్ఆర్ఎస్ విద్యార్థిని తేజశ్రీ ప్రతిభ.. బెస్ట్ ప్లేయర్ అవార్డు కైవసం

కోదాడ, నవంబర్ 04 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భువనగిరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో కోదాడ పట్టణానికి చెందిన ఎన్ఆర్ఎస్ కళాశాల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని తేజశ్రీ అద్భుత ప్రతిభ కనబరిచింది. ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టుకు ఎంపికైన తేజశ్రీ రాష్ట్రస్థాయి పోటీల్లో తన ఆటతీరుతో ఆకట్టుకోవడమే కాకుండా బెస్ట్ ప్లేయర్ అవార్డును సైతం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తేజశ్రీని కళాశాల చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి, డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ జి.వి., వైస్ ప్రిన్సిపాల్ పి.ఎన్.ఆర్.తో పాటు పలువురు అధ్యాపకులు ఘనంగా అభినందించారు. క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

దరఖాస్తుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు సర్పంచ్ కాలాలి సురేఖ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభం



దరఖాస్తుపల్లి, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ పరిధిలో ని దరఖాస్తుపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం సర్పంచ్ కె. సురేఖ, సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపాధి హామీ పనులు దోహదపడతాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గ్రామీణ కూలీలకు పనులు కల్పించి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే ఉపాధి హామీ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి-65పై దెబ్బతిన్న బ్రిడ్జిని పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఆర్ఎఫ్ కంపెనీ సమీపంలో జాతీయ రహదారి-65పై ఉన్న బ్రిడ్జి దెబ్బతిన్నట్లు సమాచారం అందడంతో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ సంఘటనా స్థలానికి చేరుకుని బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించారు. బ్రిడ్జి దెబ్బతినడంతో వాహనదారులు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. సంబంధిత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో సమన్వయం చేసుకుంటూ బ్రిడ్జి మరమ్మతు పనులను చేపట్టినట్లు తెలిపారు. మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. వాహనదారులు పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకరించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీ సత్యయ్య గౌడ్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి: మెదక్ ఎస్పీ





రామాయంపేట, నవంబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామాయంపేటలో నిర్వహించిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో విధి నిర్వహణలో 14 మంది పోలీసులు అమరులయ్యారని, వారి కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. షీ టీమ్స్, సైబర్ భద్రతపై కానిస్టేబుల్ ప్రసాద్ రచించిన పాటలను ఆవిష్కరించి అభినందించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, లయన్స్ క్లబ్, తలసేమియా సొసైటీ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

మెదక్, నవంబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, కరువు నివారణకు రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, కార్యదర్శివర్గ సభ్యుడు ఏ. మల్లేశం ఆధ్వర్యంలో జిల్లా ఏడీ యూనిట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ జిల్లా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉందని, సాగునీటి వనరులు తక్కువగా ఉండటంతో రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో జిల్లాలోని 21 మండలాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించడం అన్యాయమని పేర్కొన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, ప్రతి ఎకరాకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు కూలీ పనుల కోసం వలస వెళ్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కరువు పరిస్థితులపై శాస్త్రీయంగా పునఃపరిశీలన చేసి జిల్లాలోని మొత్తం 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక అధ్యయనం చేపట్టాలని కోరారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.



ఇంటర్ జోనల్ టీ20లో మెదక్ పోలీసుల సత్తా

మెదక్, నవంబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కరీంనగర్‌లో నిర్వహించిన ఇంటర్ జోనల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో మెదక్ జిల్లా పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో సిరిసిల్ల పోలీస్ జట్టుపై 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేత జట్టును ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అభినందించి సన్మానించారు. ఈ టోర్నమెంట్‌లో మెదక్, సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల పోలీస్ జట్లు పాల్గొనగా, తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన మెదక్ జట్టు సమష్టి కృషి, అద్భుత ఆటతీరుతో విజయాన్ని సాధించింది. మూడు మ్యాచ్‌లలో కలిపి 295 పరుగులు సాధించిన సాయి లాటికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. జట్టు కెప్టెన్ తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్‌తో పాటు ప్రతిభ కనబరిచిన సాయి లాటిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు పోలీసుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, సమష్టి కృషి వంటి లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించి మెదక్ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, సీఐలు మహేష్, వెంకట రాజా గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బేతుపల్లి చెరువులో ఎస్‌డీఆర్‌ఎఫ్ బోట్ల గల్లంతు ఘటనపై నిరంతర సమీక్ష.. మంత్రి పొంగులేటి

ఖమ్మం, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని బేతుపల్లి చెరువులో ఎస్‌డీఆర్‌ఎఫ్ బోట్లు గల్లంతైన ఘటనపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే వివరాలు తెలుసుకున్నారని, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన అన్ని రకాల సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. సంఘటన జరిగిన ప్రాంతంలో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని, అవసరమైన రక్షణ పరికరాలు, అదనపు బోట్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. గల్లంతైన ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆచూకీ తెలుసుకునేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌తో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని, సహాయక చర్యల పురోగతిని నిరంతరం సమీక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. పరిస్థితిని స్వయంగా పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకోనున్నట్లు వెల్లడించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని క్షేమంగా బయటకు తీసుకురావడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని, ఈ విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

విద్యుత్ ఉద్యోగులకు 2.543 శాతం డీఏ పెంపు.. ఉప ముఖ్యమంత్రి భట్టికి TGPEJAC కృతజ్ఞతలు

హైదరాబాద్, నవంబర్ 4 (సందేశం టైమ్స్ ప్రతినిధి): విద్యుత్ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) పెంపునకు ఆమోదం తెలపడంపై తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (TGPEJAC) నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రిని కలిసిన TGPEJAC నాయకుల బృందం ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసింది. జూలై 2026 నుంచి అమల్లోకి వచ్చేలా 2.543 శాతం డీఏ పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, దీంతో విద్యుత్ ఉద్యోగుల డీఏ 19.272 శాతం నుంచి 21.815 శాతానికి పెరిగిందని నాయకులు వెల్లడించారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్లకు సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినందుకు కూడా భట్టికి ధన్యవాదాలు తెలిపారు. సెలవులు, గ్రాట్యుటీ, పదోన్నతులు తదితర సమస్యలపై దృష్టి సారించాలని TG ట్రాన్స్‌కో, TG జెన్‌కో, రెండు విద్యుత్ పంపిణీ సంస్థలకు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు భట్టి ఆసక్తి చూపడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగి 20,018 మెగావాట్లకు పైగా గరిష్ఠ స్థాయికి చేరుకున్నప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో TGTRANSCO, TGGENCO, TGDISCOMల ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు సమష్టిగా చేసిన కృషి అభినందనీయమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, గృహ వినియోగదారులు, పారిశ్రామిక సంస్థలకు ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేసిన సిబ్బంది సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి PRC-2026 ప్రక్రియను వేగవంతం చేయాలని JAC నాయకులు కోరగా, ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రానున్న రబీ సీజన్‌లోనూ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా విద్యుత్ రంగ ఉద్యోగులందరూ అంకితభావంతో పనిచేస్తారని ఉప ముఖ్యమంత్రికి హామీ ఇచ్చినట్లు TGPEJAC కోఆర్డినేటర్ పరికె సదానందం తెలిపారు. ఈ సమావేశంలో TGPEJAC కన్వీనర్ రత్నాకర్ రావు, సెక్రటరీ జనరల్ శ్రీధర్, 1104 అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ వజీర్, సదానందం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల మాప్‌అప్ లాటరీ పూర్తి.. 14 నియోజకవర్గాల్లో 1,741 ఇండ్ల కేటాయింపు

హైదరాబాద్, నవంబర్ 4: ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పైలట్ ప్రాజెక్టులో భాగంగా వివిధ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న ఇళ్లలో పలు కారణాలతో ఖాళీగా ఉన్న 1,741 ఇళ్లను బుధవారం నిర్వహించిన మాప్‌అప్ ఈ-లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలివైపు ఉన్న క్యూర్ ప్రాంతంలోని అల్పాదాయ వర్గాల ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద ఇళ్లు కావాలనుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, లాటరీ ద్వారా కేటాయింపులు చేపట్టింది. తొలివిడత పైలట్ ప్రాజెక్టులో ప్రతి నియోజకవర్గంలో 480 ఇళ్ల చొప్పున నిర్మాణం చేపట్టగా, ఇప్పటికే కేటాయించిన ఇళ్లలో క్షేత్రస్థాయి పరిశీలనలో కొందరు అనర్హులుగా తేలడం, ఎంపికైన వారిలో మరికొందరు ఆర్థిక పరిస్థితుల కారణంగా కేటాయింపులను రద్దు చేసుకోవడంతో 14 నియోజకవర్గాల పరిధిలో 1,741 ఇళ్లు ఖాళీగా అందుబాటులోకి వచ్చాయి. వీటిని బుధవారం నిర్వహించిన మాప్‌అప్ ఈ-లాటరీ ద్వారా అర్హులైన వారికి కేటాయించారు. నియోజకవర్గాల వారీగా కుత్బుల్లాపూర్‌లో 80, మల్కాజిగిరిలో 150, కూకట్‌పల్లిలో 59, సనత్‌నగర్‌లో 88, కంటోన్మెంట్‌లో 66, బహదూర్‌పురలో 91, కార్వాన్‌లో 73, మేడ్చల్‌లో 143, నాంపల్లిలో 106, మలక్‌పేటలో 171, మహేశ్వరంలో 201, రాజేంద్రనగర్‌లో 133, ఖైరతాబాద్‌లో 327, అంబర్‌పేటలో 53 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఖాళీగా ఉన్న ఇళ్లకు అదనంగా మరో 875 మందిని వెయిటింగ్ లిస్ట్ కోసం ఈ-లాటరీ ద్వారా ఎంపిక చేశారు. లాటరీలో ఎంపికైన వారందరికీ ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించగా, వారి వివరాలను ధ్రువీకరించేందుకు అధికారులు త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాత పాఠశాలలు, కళాశాలలకు ఫైర్ ఎన్ఓసీ నిబంధనలు సరళీకరణ.. నవంబర్ 10 నుంచి కొత్త మార్గదర్శకాలు అమలు

హైదరాబాద్, నవంబర్ 4 (సందేశం టైమ్స్): రాష్ట్రంలోని ఇప్పటికే ఉన్న పాఠశాలలు, జూనియర్, ఇంటర్మీడియట్ కళాశాలలకు అగ్నిమాపక శాఖ నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఫైర్ ఎన్ఓసీ) జారీ నిబంధనలను తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, పౌర రక్షణ శాఖ సరళీకరించింది. ఈ మేరకు శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ (ఐపీఎస్) నూతన మార్గదర్శకాలను ప్రకటించారు. పాత విద్యాసంస్థల భవనాల్లో ఖాళీ స్థలాలు, అదనపు మెట్ల మార్గాల ఏర్పాటు విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతకు అవసరమైన అగ్ని నివారణ, ప్రాణ రక్షణ, అత్యవసర తరలింపు చర్యల్లో మాత్రం రాజీ ఉండదని స్పష్టం చేశారు. విద్యాసంస్థల యాజమాన్య సంఘాల వినతులు, సెప్టెంబర్ 8న సంబంధిత భాగస్వాములతో నిర్వహించిన సమావేశంలో వచ్చిన అభిప్రాయాల ఆధారంగా మార్గదర్శకాలను రూపొందించారు. కొత్త నిబంధనల ప్రకారం ఇప్పటికే అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను పరిగణనలోకి తీసుకుంటారు. అదనపు ఖాళీ స్థలాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరరు. సెట్‌బ్యాక్‌లు తక్కువగా ఉండి, పక్కనే రహదారి లేని వైపులలో అగ్ని వ్యాప్తిని నిరోధించేందుకు వాటర్ కర్టెన్లు ఏర్పాటు చేయాలి. నాలుగు వైపుల నుంచి అగ్నిమాపక నీటిని అందించే ఫైర్ బ్రిగేడ్ ఇన్‌లెట్ కూడా ఏర్పాటు చేయాలి. అదనపు ఖాళీ స్థలాలను సృష్టించడం సాధ్యం కాని భవనాలకు ఈ ప్రత్యామ్నాయ చర్యలు వర్తిస్తాయి. భవనాల ఎత్తు, నిర్మాణ స్వరూపాన్ని బట్టి అగ్నిమాపక పరికరాలు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సర్వర్ గదుల్లో అవసరమైన చోట మాడ్యులర్ స్ప్రింక్లర్లు, హోస్ రీల్స్, ఎలక్ట్రానిక్ ఫైర్ అలారం వ్యవస్థలు, డౌన్‌కమర్లు, పైకప్పుపై అగ్నిమాపక నీటి నిల్వ ట్యాంకులు, పంపులు ఏర్పాటు చేయాలి. మెట్ల మార్గాలు, కారిడార్లు, బయటకు వెళ్లే ద్వారాలు, అత్యవసర మార్గాల్లో ఎలాంటి అడ్డంకులు ఉండకూడదు. అత్యవసర సమయంలో బయటకు వెళ్లే ద్వారాలు తరలింపు దిశలో తెరుచుకునేలా చూడాలి. అత్యవసర లైటింగ్, ఎగ్జిట్ సూచికలు, అగ్నిమాపక నీటి నిల్వలు అందుబాటులో ఉంచాలి. అత్యవసర తరలింపు ప్రణాళికలు, సంప్రదింపు నంబర్లు, అగ్ని భద్రతా సూచనలను ప్రముఖ ప్రదేశాల్లో ప్రదర్శించాలి. పాఠశాల భద్రతా సలహా కమిటీలు, అగ్ని భద్రతా కార్యాచరణ బృందాలను ఏర్పాటు చేసి సిబ్బందికి శిక్షణ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యుత్ భద్రత, పరికరాల నిర్వహణ, ప్రథమ చికిత్స సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఫైర్ ఎన్ఓసీ కోసం దరఖాస్తు చేసుకునే ముందు యాజమాన్యాలు వర్తించే నిబంధనలను పాటించాలి. ఇప్పటికే అమల్లో ఉన్న స్వీయ ధ్రువీకరణ విధానాన్ని ఈ మార్గదర్శకాలు పరిమితం చేయవని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం దానిని కొనసాగించవచ్చని శాఖ స్పష్టం చేసింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం జారీ చేసే ఆక్యుపెన్సీ ఎన్ఓసీ మూడేళ్లపాటు చెల్లుబాటులో ఉంటుంది. గడువు ముగియడానికి రెండు నెలల ముందే నిర్దేశిత రుసుము చెల్లించి పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవాలి. ఈ సవరించిన మార్గదర్శకాలు నవంబర్ 10, 2026 నుంచి అందే ఎన్ఓసీ దరఖాస్తులకు వర్తిస్తాయి. ఈ మేరకు Rc.No.3455/MSB/2026, తేదీ 04.11.2026న సర్క్యులర్ జారీ చేసినట్లు శాఖ వెల్లడించింది.





ఏఐజీ ఆస్పత్రుల సహకారంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో బీఎస్సీ కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ కోర్సు

హైదరాబాద్, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): వైద్య రంగానికి అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (YISU), ఏఐజీ ఆస్పత్రులు సంయుక్తంగా నిర్వహిస్తున్న బీఎస్సీ కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ (CVT) కోర్సు 2026 బ్యాచ్‌కు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశంలో ఏఐజీ ఆస్పత్రుల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఎల్.వి.ఎస్. సుబ్బారావుతో పాటు ఇరు సంస్థలకు చెందిన విద్యా, వైద్య రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్సులో ప్రవేశ అర్హతలు, ఫీజుల విధానం, పాఠ్యప్రణాళిక, సిలబస్‌లో చేయాల్సిన మార్పులపై సమగ్రంగా చర్చించారు. కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ రంగంలో అభివృద్ధి చెందుతున్న ఆధునిక వైద్య పరిజ్ఞానం, మారుతున్న చికిత్సా విధానాలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించేలా పాఠ్యాంశాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. కేవలం తరగతి గది బోధనకే పరిమితం కాకుండా ఆస్పత్రుల్లో ప్రత్యక్ష అనుభవం, క్లినికల్ శిక్షణ, ప్రాక్టికల్ లెర్నింగ్ అవకాశాలను మరింత విస్తరించాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ప్రస్తుత వైద్య రంగ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేలా శిక్షణా విధానాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. పరిశ్రమలు, విద్యాసంస్థల భాగస్వామ్యంతో ఉపాధి అవకాశాలకు అనుగుణమైన విద్యను అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఏఐజీ ఆస్పత్రులు కలిసి పనిచేస్తున్నాయని, ఈ భాగస్వామ్యం ద్వారా భవిష్యత్తులో వైద్య రంగానికి అవసరమైన నైపుణ్యం కలిగిన కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ నిపుణులను తయారు చేయడానికి అవకాశం కలుగుతుందని ప్రతినిధులు పేర్కొన్నారు.



భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం.. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే

హైదరాబాద్, నవంబర్ 4 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సమగ్రంగా సర్వే చేసి, భూ యజమానులకు వివాదరహితమైన భూములతో పాటు భద్రతతో కూడిన రికార్డులు, పాస్‌బుక్కులు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని వెల్లడించారు. రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వే జరిగే గ్రామాల్లో తహశీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించడంతో పాటు కనీసం వారానికి ఒకరోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. బుధవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన భూ సర్వే, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, హౌసింగ్ అంశాలపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేను చట్టంలో నిర్దేశించిన విధంగా తొలుత ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడతగా వేగవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షించామని, ప్రస్తుతం నేరుగా జిల్లాలకు వెళ్లి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందితో సమావేశమై సమస్యలను తెలుసుకుంటున్నామని వివరించారు. మండల స్థాయి అధికారుల జాబితా నుంచి యాదృచ్ఛికంగా అధికారులను ఎంపిక చేసి సర్వే అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై నేరుగా చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కోరుతున్న అంశాలు, అధికారులకు ఎదురవుతున్న సమస్యలు, పరిష్కారానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు, మార్గదర్శకాలపై వాస్తవాలను స్పష్టంగా వివరించాలని సూచించారు. సమస్యలను దాచిపెట్టకుండా తెలియజేస్తే సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలను నిజాయితీగా పరిష్కరిస్తూ బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందని, ఉద్దేశపూర్వకంగా సమస్యలను తప్పుదోవ పట్టించే లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో మరోసారి ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా భూముల కొలతలతో పాటు సర్వే నంబర్లు ఒకచోట ఉండటం, వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూముల సమస్యలు, భూముల హద్దులకు సంబంధించిన వివాదాలను గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. 22-ఏకు సంబంధించి ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోల పరిధిలోకి రాని అంశాలను కూడా పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



యాదవుల ఆత్మగౌరవానికి పెద్దపీట.. సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 4 (సందేశం టైమ్స్): యాదవ సోదరుల ఆత్మగౌరవానికి ఎక్కడా లోటు లేకుండా చూడటమే తమ ప్రభుత్వ బాధ్యతని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. సదర్ సమ్మేళనం కేవలం యాదవులకే పరిమితమైన కార్యక్రమం కాదని, తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర చరిత్రలో యాదవుల పాత్ర ఎంతో కీలకమని, ప్రస్తుతం గోల్కొండ కోటగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు గొల్లంకొండగా ప్రసిద్ధి చెందిందని గుర్తుచేశారు. యాదవ సోదరుల సహకారం, ఆదరణతోనే హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందిందని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారిని యాదవులు అక్కున చేర్చుకుని ఆదరించారని కొనియాడారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని, యాదవుల కోరిక మేరకు తమ ప్రభుత్వం సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా కల్పించిందని తెలిపారు. సమ్మేళనం నిర్వహణ కోసం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణలో కులగణన నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలిచామని, తెలంగాణ మోడల్‌ను దేశంలోని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత రాజకీయ, సామాజిక ప్రాధాన్యత కల్పించామని తెలిపారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట ఆలయ బోర్డు సభ్యురాలిగా నియమించామని వివరించారు. యాదగిరిగుట్ట గోశాలలో గోవుల సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని, వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతామని భరోసా ఇచ్చారు. తెలంగాణను దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లేందుకు యాదవ సోదరుల సహకారం అవసరమని ముఖ్యమంత్రి కోరారు.

రైతు భరోసా నిధుల విడుదలపై వచ్చిన సందేశాలు అవాస్తవం.. వ్యవసాయ శాఖ స్పష్టీకరణ

హైదరాబాద్, నవంబర్ 4 (సందేశం టైమ్స్): రైతు భరోసా నిధులు విడుదలయ్యాయంటూ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల రైతులకు బుధవారం ఉదయం వచ్చిన సందేశాలు పూర్తిగా అవాస్తవమని తెలంగాణ వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి ఐఏఎస్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. రైతు భరోసా నిధులు జమయ్యాయంటూ రైతులకు సందేశాలు వచ్చినట్లు వ్యవసాయ శాఖ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయంపై సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్), నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సంస్థలతో చర్చించిన అనంతరం ఆ సందేశాలు పూర్తిగా అవాస్తవమైనవిగా, నిరాధారమైనవిగా నిర్ధారించినట్లు వెల్లడించారు. ఈ సందేశాల వెనుక ఉన్న వాస్తవాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం పోలీసులకు సమాచారం అందించామని, పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కోరినట్లు డాక్టర్ బి.గోపి తెలిపారు.



కొడంగల్‌లో నవంబర్ 7 నుంచి 9 వరకు మెగా రైతు మేళా.. 150 ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు

హైదరాబాద్, నవంబర్ 4 (సందేశం టైమ్స్): రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, అధిక ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు కొడంగల్‌లో నవంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజులపాటు మెగా రైతు మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. నవంబర్ 7న ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సమక్షంలో ఈ మేళాను ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు ప్రదర్శన స్టాళ్లను సందర్శించనున్నారు. ఈ మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలు, ఆయిల్‌ఫెడ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బ్యాంకింగ్ సంస్థలు, విత్తన పరిశ్రమలు, వాలంతరి, క్రిడా, కేంద్ర ప్రభుత్వ సంస్థలు సహా మొత్తం 26 ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థల భాగస్వామ్యంతో సుమారు 150 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ ఇన్‌పుట్స్, నాణ్యమైన విత్తనాలు, నూతన తరం రసాయనాలు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, డ్రోన్లు, వివిధ శాఖల సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలను ప్రదర్శించనున్నారు. మూడు రోజులపాటు రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అవార్డు గ్రహీతలు, ప్రగతిశీల రైతులతో సాంకేతిక సమావేశాలు, ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు. ఆధునిక సాగు పద్ధతులు, పంటల విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ అవకాశాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను వివరించనున్నారు. మొదటి రోజు కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని వికారాబాద్, నారాయణపేట జిల్లాల నుంచి సుమారు 7,500 మంది రైతులు పాల్గొననున్నారు. రైతులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేయనున్నారు. ప్రారంభోత్సవం అనంతరం PJTAU, KLSHU శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, అధికారులు, ప్రగతిశీల రైతులు తమ అనుభవాలు, విజయగాథలను పంచుకోనున్నారు. ఇందుకోసం 2,500 మంది కూర్చునే సామర్థ్యంతో ప్రత్యేక హాలును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయంపై వాటి ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై ప్రత్యేక చర్చలు జరగనున్నాయి. విజయవంతమైన రైతుల అనుభవాలను తెలియజేసే డాక్యుమెంటరీలు, వీడియోలను ప్రదర్శించనున్నారు. సంప్రదాయ పంటలపై ఆధారపడటాన్ని తగ్గించి, అధిక ఆదాయాన్నిచ్చే ప్రత్యామ్నాయ పంటలు, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించనున్నారు. మొదటి రోజు ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా కస్టమ్ హైరింగ్ సెంటర్లు, పప్పుధాన్యాల మిల్లులు, నూనె గానుగ యూనిట్లు, భూసార పరీక్ష కార్డులు, బయో రిసోర్స్ ఇన్‌పుట్ సెంటర్లు, ఉద్యానవన శాఖకు సంబంధించిన డ్రిప్ సిస్టమ్స్ తదితర వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, యూనిట్లను రైతులకు పంపిణీ చేయనున్నారు. మొదటి రోజు కార్యక్రమాలు సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయి. రెండో రోజు మహిళా రైతులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వారి పాత్ర, ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించనున్నారు. మూడో రోజు పొరుగు జిల్లాలతో పాటు మొత్తం 10 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. చివరి రోజు సాయంత్రం ముఖ్యమంత్రి ప్రసంగంతో రైతు మేళా ముగియనుంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, సాంకేతిక సంస్థలతో నేరుగా చర్చించి ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని పొందేందుకు ఈ మేళా మంచి అవకాశమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులందరూ మూడు రోజుల మెగా రైతు మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు.. 2.21 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 4 (సందేశం టైమ్స్): రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 2,21,500 ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. ఈ దీపావళి రోజున ప్రతి ఇందిరమ్మ ఇంట్లో దీపాలు వెలిగించి వేడుకలు నిర్వహించాలని, పేదల ఇళ్లలో వెలిగే ప్రతి దీపం ప్రజాప్రభుత్వ సంకల్పానికి ప్రతీక కావాలని ఆకాంక్షించారు. బుధవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. దీపావళి రోజున గృహప్రవేశాలు పూర్తయిన ఇళ్లకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వెళ్లి లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి గుర్తుగా రూపొందించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు' పోస్టర్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రివర్గం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుకుంటోందని తెలిపారు. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో మరో లక్ష ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ తరహాలోనే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ నగరపాలక సంస్థల్లో కూడా ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. జి+5 విధానంలో నిర్మించనున్న ఈ టవర్లకు సంబంధించి దీపావళిలోగా నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్ల నుంచి వచ్చే ఏడాది బోనాల పండుగకు బోనాలు ఎత్తిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.40 వేల కోట్లతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేసేది లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రతి సోమవారం హైదరాబాద్ నుంచి నేరుగా, పారదర్శకంగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. నగరాలు, పట్టణాలు, గ్రామాలతో పాటు మారుమూల ప్రాంతాలు, తండాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని, తద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు.

సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక
నందు పనిచేయుటకు విలేకరులు కావలెను



ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

జిల్లాల ఇంచార్జీలు	నియోజకవర్గం ఇంచార్జీలు	మండల రిపోర్టర్లు	యాడ్స్ సేకరించుటకు
ప్రతి జిల్లాకు ఇంచార్జీలు అవసరం	ప్రతి నియోజకవర్గానికి ఇంచార్జీలు అవసరం	ప్రతి మండలానికి రిపోర్టర్లు కావలెను	శాలరీ లేదా కమిషన్ బేసిక్ లో ఎంప్యాయస్ కావలెను

ఈ QR కోడ్‌ల ద్వారా స్వాన్ చేయడం ద్వారా
మీరు డైరెక్ట్ గా వెబ్‌సైటె మరియు
ప్లే స్టోర్ యాప్ లింక్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

ANDROID APP

GET IT ON Google Play

- స్వతంత్రంగా పని చేసుకునే అవకాశం
- మీ ప్రాంతంలో జరగే వార్తల ప్రచురరణ
- మీ ప్రతిభకు తగిన గుర్తింపు
- శిక్షణ మరియు పూర్తి మార్గదర్శనం



WEBSITE

https://sandeshamtimes.com

మరిన్ని వివరాలకు సంప్రదించండి
9052045435

CEO
శెట్టి వెంకటేష్ గౌడ్

సందేశం టైమ్స్... నిజం దాగదు... వార్త ఆగదు...



నేటి ద్వాదశ రాశుల ఫలితాలు – నవంబర్ 05, 2026

మేషం: నూతన వాహనం కొనుగోలు చేసే అవకాశాలున్నాయి. వృత్తి, ఉద్యోగ రంగాల్లో మీ పనితీరుతో అధికారులను ఆకట్టుకుంటారు. ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వ్యాపారాల్లో విశేషమైన లాభాలు పొందుతారు. కొన్ని సంఘటనలు ఆశ్చర్యానికి గురిచేస్తాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

వృషభం: దూర ప్రయాణాల్లో ఆటంకాలు ఎదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. ఉద్యోగంలో అధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి.

మిథునం: ఆర్థికంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆప్తుల నుంచి విలువైన సమాచారం అందుతుంది. ఉద్యోగులకు పదోన్నతులు లభించే అవకాశాలున్నాయి. వ్యాపారాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో వివాదాలు సమసిపోతాయి.

కర్కాటకం: సన్నిహితులతో కలిసి దైవదర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులకు మీ ఆలోచనలు నచ్చుతాయి. పనుల్లో జాప్యం జరిగినప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాల్లో శ్రమ పెరుగుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. స్థిరాస్తి ఒప్పందాలు అంతగా కలిసిరావు.

సింహం: అనవసర ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. దైవానుగ్రహంతో కొన్ని పనులు పూర్తవుతాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు ఏర్పడవచ్చు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగాల్లో అదనపు పనిభారం పెరుగుతుంది. తగిన విశ్రాంతి లభించదు. దైవచింతన పెరుగుతుంది.

కన్య: బంధుమిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రయాణాల్లో వాహన ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగులకు అనూహ్య స్థానచలనాలు కలిగే అవకాశాలున్నాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. వ్యాపార వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి.

తుల: ఆరోగ్య సమస్యల విషయంలో వైద్యులను సంప్రదించాల్సి వస్తుంది. ఇంటా బయట గందరగోళ పరిస్థితులు ఎదురవుతాయి. జీవిత భాగస్వామితో కొన్ని విషయాల్లో విభేదాలు రావచ్చు. విద్యార్థులకు పరీక్ష ఫలితాలు నిరుత్సాహం కలిగిస్తాయి. ఉద్యోగుల్లో పని ఒత్తిడి పెరుగుతుంది. అవసరమైన సమయంలో చేతిలో డబ్బు నిల్వ ఉండక ఇబ్బందులు ఎదురవుతాయి.

వృశ్చికం: ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాల్లో సహోద్యోగుల సహకారంతో పనులు పూర్తి చేస్తారు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు తొలగిపోతాయి. దీర్ఘకాలిక రుణ ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనుస్సు: కుటుంబ పెద్దల నుంచి ఊహించని సమస్యలు ఎదురుకావచ్చు. సంతానం ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు ఏర్పడతాయి. ఉద్యోగాల్లో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాల్లో స్వల్ప లాభాలు పొందుతారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మకరం: ఆర్థిక పరిస్థితి సాధారణంగా ఉంటుంది. రుణ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. మాతృవర్గ బంధువులతో మాటపట్టింపులు రావచ్చు. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. నిరుద్యోగ ప్రయత్నాల్లో జాప్యం కలుగుతుంది. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. రావాల్సిన సొమ్ము సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతాయి.

కుంభం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాల గురించి చర్చిస్తారు. ఉద్యోగాల్లో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. నిరుద్యోగులకు సన్నిహితుల సహకారంతో కొత్త ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాల్లో నూతన పద్ధతులు అనుసరించి లాభాలు పొందుతారు.

మీనం: ఉద్యోగంలో అధికారులతో వాదనలకు దూరంగా ఉండటం మంచిది. అనవసర ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాల్లో సమస్యలు ఎదురవుతాయి. కంటి సంబంధిత ఆరోగ్య సమస్యలు ఇబ్బంది పెట్టవచ్చు. కొన్ని వ్యవహారాల్లో ఇతరుల నుంచి వ్యతిరేకత ఎదురవుతుంది..



రేకుల ఇళ్లలో నిరుపేదల అవస్థలు.. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపులు!

చింతకాని, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం తిరుమలాపురం గ్రామంలో రేకుల ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇటీవల వీచిన ఈదురుగాలులు, కురిసిన వర్షాలకు ఇళ్ల పైకప్పులు దెబ్బతినడంతో పాటు పాములు, తేళ్ల భయంతో చిన్నపిల్లలతో సహా కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇలాంటి నిరుపేద కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు కోరారు. ఈ మేరకు బుధవారం చింతకాని ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు. చుంచు శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో ఉన్న అనర్హులను తొలగించి, నిజమైన అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రేకుల ఇళ్లలో కనీస నివాస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాల పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, గ్రామసభ ద్వారా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోగుల నాగమణి, గ్రామ నాయకుడు గోగుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా దుకాణాలకు తప్పనిసరిగా అనుమతులు పొందాలి

చింతకాని, నవంబర్ 04 (సందేశం టైమ్స్ ప్రతినిధి): దీపావళి పండుగ సందర్భంగా చింతకాని మండలంలోని వివిధ గ్రామాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునే వ్యాపారులు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు, లైసెన్సులు పొందాలని చింతకాని ఎస్సై జి. నరేష్ సూచించారు. అనుమతులు పొందిన వ్యాపారులు మాత్రమే అధికారులు కేటాయించిన ప్రదేశాల్లో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. బాణసంచా విక్రయాల సమయంలో ప్రభుత్వ నిబంధనలు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. దుకాణాల్లో అగ్నిప్రమాద నివారణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వ చేయడం, విక్రయించడం వంటివి చేయరాదని హెచ్చరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసినా, అక్రమంగా బాణసంచా నిల్వ చేసినా లేదా విక్రయించినా సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీపావళి పండుగను ప్రజలందరూ సురక్షితంగా జరుపుకునేలా వ్యాపారులు పోలీస్ శాఖకు సహకరించాలని, నిబంధనలు పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై జి. నరేష్ విజ్ఞప్తి చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.